క్లుప్తంగా

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



పూజల్లో పాల్గొన్న భక్తులు

రేగిడి: స్థానిక విశ్వసాయి మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వక్త, హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావాలను ప్రతిఒక్కరూ పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమన్నారు. మానవసేవే మాధవసేవ అని, ఏమీ లేనివారికి మనకు తోచిన సాయం చేయాలన్నారు. మంచి పనులు చేసిన వారికి తప్పకుండా మోక్షం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రుత్విక్కులు వేమకోటి ప్రసాద్‌శర్మ, అంపోలు రామ్‌ప్రసాద్ శర్మ, వేమకోటి జానకీరామ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

వాడాడ విద్యార్థి ప్రతిభ



భానుశంకర్

బాడంగి: నీట్(నేషనల్ ఎలిజిబిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్)–2024లో మండలంలోని వాడాడ గ్రామానికి చెందిన విద్యార్థి కొల్లి భానుశంకర్ విశేష ప్రతిభ కనబరిచాడు. వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు గాను జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలో 720 మార్కులకు 675 మార్కులు సాధించి, ఓపెన్ కేటగిరీలో 11,229వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 4,664వ ర్యాంకు సాధించాడు. విద్యార్థి తండ్రి రామచంద్రరావు విశాఖ షిప్‌యార్డులో పనిచేస్తుండగా, తల్లి సుజాత గృహిణి. నీట్ ఫలితాల్లో సత్తా చాటిన భానుశంకర్‌ను తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు.

అందుబాటులో వరి విత్తనాలు



వన్నలిలో రైతులకు విత్తనాలు విక్రయిస్తున్న సిబ్బంది

రేగిడి: ఖరీఫ్ సాగుకు సంబంధించి, రైతులకు సరిపడ వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో పి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని చాటాయవలస, లక్ష్మీపురం, ఉనుకూరు, బూరాడ తదితర గ్రామాల రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు వరి విత్తనాలు ఆదివారం అందజేశారు. సాంబమసూరి, స్వర్ణ, 1121 రకాల వరి విత్తనాలు ప్రస్తుతం ఆర్‌బీకేల వద్ద ఉన్నాయని, కావాల్సిన వారు సిబ్బందిని సంప్రదించి తీసుకోవాలన్నారు.

రూ.52.80 లక్షలతో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం



అంతకాపల్లిలో నిర్మాణ దశలో రక్షిత మంచి నీటి పథకం

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నిర్మాణ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. రూ.52.80 లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులతో ఈ ట్యాంకు నిర్మాణం జరుగుతోందని సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు తెలిపారు. నిర్మాణం అనంతరం ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు.

ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు



రాజాంలో సర్వే చేస్తున్న ఐఈడీ ఉపాధ్యాయులు

రాజాం: మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేకావసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నారు. నెలరోజులుగా కొనసాగుతున్న ఈ సర్వేలో ఇప్పటివరకు మొత్తం 32 మంది దివ్యాంగ చిన్నారులను గుర్తించినట్లు ఎంఈవోలు ప్రవీణ్‌కుమార్, యాగాటి దుర్గారావు తెలిపారు. భవిత కేంద్రం ద్వారా ఈ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించడంతో పాటు బిహేవియర్ మాడిఫికేషన్ చేయడం, ఫిజియో, స్పీచ్ థెరపీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆదివారం స్థానిక మల్లిఖార్జున కాలనీలో చేసిన సర్వేలో ఐఈడీ ఉపాధ్యాయులు ఎస్.హరిబాబు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగులో రైతులు బిజీ



నాగలి సహాయంతో దుక్కి చేస్తున్న రైతు

ఖరీఫ్ సాగు పనుల్లో అన్నదాతలు బిజీబిజీగా ఉన్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలు దుక్కి పనులకు అనుకూలంగా ఉండడంతో ఉదయమే పొలాలను చేరుకుని, నాగలి, ట్రాక్టర్ల సాయంతో దుక్కి పనులు చేస్తున్నారు. వర్షాధార, మెట్టు ప్రాంతాల్లో వరి విత్తనాలు జల్లుతున్నారు. ఉన్న ఊరిలోని రైతు భరోసా కేంద్రాల్లోనే విత్తనాలు, ఎరువులు లభిస్తుండడంతో పొలం పనులు సాఫీగా జరుగుతున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–వంగర



విత్తనాలు వేస్తున్న రైతు



పొలంగట్లు బాగుచేసుకునే పనిలో నిమగ్నమైన రైతులు

ప్రకృతి వ్యవసాయంపై రైతుల ఆసక్తి



ప్రకృతి వ్యవసాయ విధానంలో కూరగాయలు సాగు చేస్తున్న తవిటినాయుడు

రేగిడి: మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతులు ఇప్పుడు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తుండడంతో ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరిస్తూ పంటలు పండించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలోని చాటాయవలస గ్రామంలో పైల తవిటినాయుడు తనకున్న 10 సెంట్ల పొలంలో బెండ, దొండ, చిక్కుడు, బీర, ఆనప, అరటి, జామ, బొప్పాయి పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించి, పండిస్తున్నారు. రసాయన ఎరువులు వాడకుండా కేవలం సేంద్రియ ఎరువులనే ఉపయోగిస్తూ సాగు చేస్తున్న ఈ పంటలు ఆరోగ్యానికి కూడా మంచివి కావడంతో వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎగబడుతున్నారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ



పంపిణీకి నవధాన్యాల ప్యాకెట్లను సిద్ధం చేస్తున్న మహిళలు

రేగిడి: మండలంలోని అంబకండి, గుళ్లపాడు, ఉంగరాడ, రేగిడి, చాటాయవలస గ్రామాల్లోని రైతులకు నవధాన్యాల కిట్లు ఆదివారం పంపిణీ చేశారు. రాయితీ పోను ఒక్కో కిట్‌ను రూ.350కు అందించినట్లు ప్రకృతి వ్యవసాయం పీఆర్‌పీ రమాదేవి తెలిపారు. అనంతరం నవధాన్యాలు సాగు చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రధాన పంట సాగుకు ముందు నవధాన్యాలు పొలాల్లో వేసుకుని, మొక్కలైన తర్వాత నేలలో దున్నేయాలని తద్వారా నేల సారవంతమై పంటలు బాగా పండుతాయని తెలిపారు. చీడపీడలు, తెగుళ్లను సమర్థంగా ఎదుర్కొనే శక్తి పంటకు లభించడంతో పాటు నేల నుంచే పంటకు కావాల్సిన పోషకాలు లభిస్తాయన్నారు. ఆరోగ్యవంతమైన పంట అధిక దిగుబడులు వస్తాయన్నారు.

ఆర్‌బీకేలకు చేరిన ఎరువులు



సోమరాజుపేటలో యూరియా బస్తాలను అన్‌లోడ్ చేస్తున్న కూలీలు

రేగిడి: మండలంలోని చాటాయవలస, సోమరాజుపేట, అంబకండి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు యూరియా వంటి ఎరువులు ఆదివారం చేరుకున్నాయి. ఖరీఫ్ సాగును దృష్టిలో ఉంచుకుని, రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. అన్ని ఆర్‌బీకేల వద్ద సబ్సిడీపై లభ్యమయ్యే విత్తనాలు, ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులను కోరారు.

13న ఆలయ వార్షికోత్సవం

రామభద్రపురం: మండలంలోని బూసాయవలస గ్రామంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 13వ తేదీన నిర్వహిస్తున్నట్లు అర్చకులు శ్రీనివాసాచార్యులు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఆరోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయడంతో పాటు సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల మధ్యలో స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

వాహన తనిఖీలు

రాజాం సిటీ: పట్టణంలోని స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఎస్‌ఐ వై.రవికిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు ఆదివారం చేపట్టారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించడంతో పాటు పెండింగ్ చలానాలను వసూలు చేశారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు లైసెన్స్, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల కలయిక

బొబ్బిలి: పట్టణంలోని రాజా పాఠశాల, కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. 1969–70 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఎంతో ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకుని, ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు శివన్నాయుడు, సుశీలమ్మ, వెంకటరావు, మూర్తి, రఘునాథరావు, జనార్దన్, కృష్ణమూర్తి, నారాయణమూర్తి, సీతారామరాజులను సన్మానించారు. అంతకుముందు తమ బ్యాచ్‌లో చనిపోయిన కొంతమంది ఆత్మశాంతి కోసం కాసేపు మౌనం పాటించారు. ఇదిలా ఉండగా, వీరంతా ఇదే పాఠశాలలో పదో తరగతి, ఇదే కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యనభ్యసించడం విశేషం. కార్యక్రమంలో విశ్రాంత సీనియర్ రైల్వే మేనేజర్, ఆలిండియా రైల్వే పెన్షనర్స్ జాతీయ అధ్యక్షుడు ఆర్.వి.ఎస్.రాఘవరావు, ఎస్.ఎస్.ప్రసాద్, విజయగోపాల్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులు తాగునీరు బంద్

శృంగవరపుకోట: నియోజకవర్గ ప్రధాన కేంద్రం శృంగవరపుకోట పట్టణానికి రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిపేస్తున్నట్టు తాటిపూడి వాటర్ వర్క్స్ జేఈ శైలజ ఆదివారం తెలిపారు. తాటిపూడి వాటర్ పైప్‌లైన్‌లో పలు చోట్ల లీకులు ఉన్నందున వాటిని మరమ్మతులు చేసేందుకు రెండు రోజులు మెయింటెనెన్స్ వర్క్స్ చేస్తున్నట్టు చెప్పారు. మంగళవారం, బుధవారం రెండు రోజులు ఈమరమ్మతులు చేయించనున్నందున రెండు రోజులు తాగునీటి సర ఫరా ఉండదని, సమస్యని గుర్తించి, ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

అందం.. ఆహ్లాదకరం..!



రాజాం-రామభద్రపురం ఆర్అండ్‌బీ రోడ్డులో కూనాయవలస సమీపంలో రోడ్లకు ఇరువైపులా అందంగా ఇలా..



ఆహ్లాదకరంగా తెర్లాం-ఆమిటి రోడ్డు

మండువేసవిలో కూడా ఆ రోడ్లపై ప్రయాణం ఎంతో అందంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. రోడ్లుకు ఇరువైపులా చెట్లకు కాసిన పసుపు, ఎర్రటి పువ్వులు ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రాజాం–రామభద్రపురం ఆర్ అండ్ బీ రోడ్డులో తెర్లాం మండలంలోని కూనాయవలస నుంచి డి.గదబవలస గ్రామం వరకు, తెర్లాం నుంచి ఆమిటి గ్రామం వెళ్లే రోడ్లుకు ఇరువైపులా తురాయి, తదితర పువ్వుల చెట్లు ఉండగా, వాటికి పూసిన రకరకాల పువ్వులు అటుగా వెళ్లే వారి మదిని దోచుకుంటున్నాయి.

–తెర్లాం.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రతీ విద్యార్థి ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదువంటే మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులతో ఆయన పుస్తకాలు చదివించి, పుస్తకాలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. పుస్తకాలు చదివితే అపారమైన జ్ఞానం మన సొంతమవుతుందని, ఎంతోమంది పుస్తకాలు చదివే అనేకానేక విషయాలు తెలుసుకుని విజ్ఞానులుగా వెలుగొందుతున్నారన్నారు.

విద్యార్థులకు యోగాసన పోటీలు



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

రాజాం సిటీ: స్థానిక శ్రీకాకుళం రోడ్డులోని యోగా వికాస్ కేంద్రంలో విద్యార్థులకు యోగాసన పోటీలతో పాటు భగవద్గీత శ్లోకాలు, ప్రార్థనా శ్లోకాల పోటీలు ఆదివారం నిర్వహించారు. సబ్ జూనియర్ విభాగంలో 4, 5 తరగతుల విద్యార్థులకు, జూనియర్ విభాగంలో 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి సెంట్రల్ కమిటీ సభ్యుడు టి.టి.వి.రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు వెలికితీసేందుకు ఈ తరహా పోటీలు ఉపయోగపడతాయన్నారు. యోగాసనాలతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలగడంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి రోజులో ఎంతో కొంత సమయం యోగాసనాలు వేసేందుకు కేటాయించాలని తెలిపారు. కార్యక్రమంలో యోగా వికాస్ నిర్వాహకులు కొరికాన శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ రాజాం అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువను బాగుచేయండి



పిచ్చిమొక్కలతో నిండిన సాగునీటి కాలువ

వంగర: మండలంలోని కొండచాకరాపల్లి, కె.కొత్తవలస, మద్దివలస గ్రామాల్లోని పంటపొలాలకు సాగునీరు అందించే ఎస్.ఎస్.చానల్(కాలువ)ను బాగుచేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. దాదాపు రెండున్నర కిలోమీటర్ల మేర పిచ్చిమొక్కలు, పూడికలతో కాలువ నిండిపోయిందన్నారు. దీంతో సాగునీరు సాఫీగా ప్రవహించడం లేదని, సకాలంలో పొలాలకు నీరందించలేకపోతున్నామని వాపోయారు. అధికారులు స్పందించి, ఉపాధి హామీ హామీ పథకం పనుల్లో భాగంగా కాలువలోని జంగిల్స్ తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఖరీఫ్ సాగు పనుల్లోగా కాలువను బాగుచేస్తే సాగునీరు సరఫరాకు అడ్డంకులు ఉండవన్నారు.

ఘనంగా మహంకాళి అమ్మవారి పండగ

గజపతినగరం/గజపతినగరం రూరల్: మండలంలోని బూడిపేటలో గ్రామదేవత మహంకాళి అమ్మవారి పండగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బూడిపేట, దావాల పేట గ్రామస్తులు ఒక్కో ఏడాది ఒక గ్రామం వారు అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గతేడాది దావాలపేట గ్రామస్తులు పండగ నిర్వహించగా, ఈ ఏడాది బూడిపేట గ్రామస్తులు చేశారు. అమ్మవారికి రెండు గ్రామాల భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం ఈఓ కె.శ్రీరామ్, గ్రామ పెద్దలు బూడి జ్యోతి అన్ని ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్యే దంపతుల పూజలు

అమ్మవారిని స్థానిక ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్, లక్ష్మీసింధు దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి తదితరు లు పాల్గొన్నారు.